## బ్రేక్ ఫాస్ట్‌కు బ్రేక్ పడ్డట్టేనా..



2

## కలెక్టరేట్‌లో వినాయకుడికి పూజలు



2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

19-9-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## ఇంటి నంబర్లు కేటాయించాలి



**అక్షరటుడే,పెద్ద కొడప్‌గల్:** మండలంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహశీల్దార్ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సర్వే నంబర్లు కేటాయించారు. దీంతో బీజేపీ నాయకులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# 'పింఛన్' వసూళ్లకు చెక్..



**నిరుపేదలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం 'చేయూత' పింఛన్లు అందిస్తోంది. అయితే కామారెడ్డి బల్దియా పరిధిలో దరఖాస్తుదారుల నుంచి మున్సిపల్ సిబ్బంది పింఛన్ల పేరుతో అందినంత దోచుకుంటున్నారు. ఈ వసూళ్ల దందాపై 'అక్షరటుడే'లో ఈనెల 8న 'పింఛన్ కోసం పైసలియ్యాల్సిందే' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు వసూళ్లకు చెక్ పెట్టే దిశగా చర్యలు చేపట్టారు.**

**–అక్షరటుడే, కామారెడ్డి**

- కామారెడ్డి బల్దియాలో అప్రమత్తమైన అధికారులు
- 'అక్షరటుడే' కథనం ఎఫెక్ట్..
- క్షేత్రస్థాయిలో పింఛన్ దరఖాస్తుల పరిశీలన
- డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచన

కామారెడ్డి మున్సిపాలిటీలో జీతాలు, పన్ను వసూళ్లు, టెండర్లు మొదలు చిన్న పనుల వరకు చేయి తడపనిదే పని జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. తాజాగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని కూడా వదలడం లేదు. కొందరు దళారులు సిబ్బందితో కుమ్మక్కై 'మేము అన్నీ చూసుకుంటాం, పింఛన్ ఇప్పిస్తాం' అంటూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు 'అక్షరటుడే' వెలుగులోకి తెచ్చింది. కథనంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వెంటనే వార్డుల వారీగా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేశారు. ఎలాంటి దళారుల ప్రమేయం లేకుండా, నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులను గుర్తించాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

### సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు

ప్రభుత్వం పేదలకు ఉచితంగా అందిస్తున్న సేవలను సైతం అక్రమార్కులు సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అమాయక లబ్ధిదారుల నుంచి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారని 'అక్షరటుడే' బయటపెట్టింది. ఈ కథనం జిల్లాలో చర్చనీయాంశం కావడంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వెంటనే విచారణకు ఆదేశించారు. వసూళ్ల ఆరోపణల నేపథ్యంలో పారదర్శకత కోసం అధికారులు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు కార్యాలయానికే పరిమితమైన దరఖాస్తుల పరిశీలనను ఇకపై క్షేత్రస్థాయిలో చేపట్టాలని నిర్ణయించారు. వార్డుల వారీగా బృందాలను ఏర్పాటు చేసి, నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అర్హతలను పరిశీలిస్తున్నారు. దళారుల ప్రమేయం లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో, ఫొటోలతో డాక్యుమెంట్ చేస్తున్నారు.

### ఫిర్యాదు చేయాలి

పింఛన్ కోసం ఎవరైనా డబ్బులు అడిగితే భయపడవద్దని, వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ప్రజలకు సూచించారు. దీని కోసం బల్దియా కార్యాలయంలో ప్రత్యేక ఫిర్యాదు నంబర్‌ను అందుబాటులో ఉంచారు. అర్హత ఉంటే ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఉచితంగా పింఛన్లను అందిస్తోందని స్పష్టం చేశారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు.

### సిబ్బంది ప్రమేయం ఉంటే కఠిన చర్యలు

ఈ వసూళ్ల దందాలో మున్సిపల్ సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు తేలితే ఉపేక్షించేది లేదని అధికారులు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఇప్పటికే కొందరు అనుమానిత సిబ్బందిని గుర్తించినట్లు సమాచారం. విచారణలో దోషులుగా తేలితే చర్యలు తీసుకునే అవకాశాలు కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది. మధ్యవర్తుల ద్వారా సిబ్బంది వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టంగా పేర్కొన్నారు.

### దళారులను నమ్మి మోసపోవద్దు..



పేద ప్రజలకు పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై బల్దియా ఉచిత సేవలు అందిస్తోంది. ఎలాంటి అనుమానం ఉన్నా కార్యాలయంలో సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవాలి. పింఛన్లు ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దు. పింఛన్ల కోసం ఎవరు కూడా ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నాతో పాటు కమిషనర్ కు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. **– ఇప్ప ఉమారాణి, చైర్‌పర్సన్**

## హెడ్ పోస్టాఫీస్ మంజూరు చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ పట్టణానికి హెడ్ పోస్టాఫీస్ మంజూరు చేయాలని కోరుతూ బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకుడు కోనేరు శశాంక్ కోరారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్, పోస్టల్ శాఖల మంత్రి చంద్రశేఖర్ పెమ్మసానిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. బాన్సువాడ పట్టణం, నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు పోస్టల్ సేవలు మరింత సులభంగా అందుబాటులో ఉండేందుకు హెడ్ పోస్టాఫీస్ అవసరమని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని సానుకూలంగా స్పందించి, బాన్సువాడకు హెడ్ పోస్టాఫీస్ మంజూరు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు కోనేరు శశాంక్ తెలిపారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముచ్కూర్ విద్యార్థిని



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని ముచ్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని మాద సుమనశ్రీ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం ఆరె రమేశ్ వివరాలు వెల్లడించారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమనశ్రీ ఇటీవల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాల్గొంది. ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించిన శిక్షణ క్యాంపులో ప్రతిభ కనబరిచి నిజామాబాద్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈనెల 19 నుంచి 21 వరకు కమ్మర్‌పల్లిలో జరగనున్న '11వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్'లో జిల్లా జట్టు తరపున ఆమె ప్రాతినిధ్యం వహించనుంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సుమనశ్రీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరే రమేష్, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుజాత, గ్రామస్తులు అభినందించారు.

## యోగా పోటీల్లో కేవోఎస్ విద్యార్థిని ప్రతిభ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కాకతీయ ఒలింపియాడ్ విద్యార్థిని ప్రతిభ చూపిందని కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీ తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలు జరిగాయని.. ఈ క్రీడల్లో తమ కాకతీయ ఒలింపియాడ్ స్కూల్ సుభాష్ నగర్ బ్రాంచ్‌లో పదో తరగతి చదువుతున్న స్మైత్రిక చారి ప్రతిభ చూపి బంగారు పతకం సాధించారన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని దాదాపు 22 జిల్లాల నుండి వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులు అక్టోబర్ 3 నుండి 7 వరకు జైపూర్‌లోని రాజస్థాన్‌లో జరుగనున్న 51 జాతీయస్థాయి యోగాసన పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థినికి హెచ్ఎం చంద్రశేఖర్, డిప్యూటీ హెచ్ఎం భావన ఠాకూర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, యోగా కోచ్ గంగాధర్ పాల్గొన్నారు.

## యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని ఐటీ టవర్స్‌లో శనివారం ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎన్ హ్యాకథాన్-2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత, టెక్నాలజీ నిపుణులతో సీపీ ముచ్చటిస్తూ వారు రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు, సమస్యల పరిష్కార విధానాలను పరిశీలించారు. ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కీలకంగా మారుతోందని సీపీ పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వివిధ సామాజిక సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశం ఉందని సీపీ అన్నారు. యువతలో ఉన్న సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సాంకేతిక నైపుణ్యాలను సరైన దిశలో వినియోగిస్తే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.


### యువతకు ఉపయోగపడే కార్యక్రమాలివి..

'కోడ్ ఫర్ ఛేంజ్' వంటి కార్యక్రమాలు యువతను సాంకేతిక రంగంలో మరింత ప్రోత్సహించడంతో పాటు, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను రూపొందించేందుకు వేదికగా నిలుస్తాయని సీపీ తెలిపారు. పోలీసింగ్ వ్యవస్థలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజా భద్రత, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, డేటా విశ్లేషణ, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించే దిశగా సాంకేతికతకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. యువత కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవడమే కాకుండా, దానిని ప్రజా ప్రయోజనం, సమాజ శ్రేయస్సు, దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎన్ సొల్యూషన్స్ సీఈవో నజీబ్, మేనేజర్ షేక్ సబ్బార్, కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్, సుభాష్ గార్డెన్ శ్రీనివాస్, ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా శాఖ నూతన మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి ఎన్.శ్రీనివాసరావు శనివారం వివరాలు వెల్లడించారు. ఈ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను కూడా వెల్లడించారు. ఎన్నికల్లో భాగంగా ఈనెల 24న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 25న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ఉంటుంది. 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 3గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఎన్నిక అవసరమైన పక్షంలో అక్టోబర్ 4న నిజామాబాద్ బస్టాండ్ పక్కన ఉన్న ఆదర్శ హిందీ మహా విద్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 4న సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటిస్తారు. అదే రోజున నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు.

## అనుమతి లేకుంటే భవనాలు కూల్చివేస్తాం



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ పురపాలక సంఘం పరిధిలో అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ డి.గజానంద్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నూతనంగా గృహాలు, వ్యాపార సముదాయాలు (మడిగెలు) నిర్మించాలనుకునే వారు తప్పనిసరిగా ఆన్‌లైన్ విధానంలో మున్సిపల్ అనుమతి పొందాలని కమిషనర్ తెలిపారు. అనుమతి పత్రాలు వచ్చిన తర్వాత మాత్రమే నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా యజమానులకు నోటీసులు జారీ చేయడంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు. పట్టణవాసులు ఈ విషయాన్ని గమనించి, మున్సిపల్ అనుమతులు తీసుకున్న తరవాతే పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

## సొసైటీలో యూరియా బస్తాలు మాయం




**అక్షరటుడే, కామారెడ్డి:** సొసైటీలో నిల్వ ఉండాల్సిన యూరియా మాయం కావడంపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నిలదీతతో అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ ఘటన పాల్వంచ మండలం ఫరీద్‌పేట సొసైటీలో చోటుచేసుకుంది. గ్రామంలోని సొసైటీ గోదాం నుంచి 177 యూరియా బస్తాలు మాయం కావడం తీవ్ర కలకలం రేపుతోంది. రైతుల కోసం సొసైటీ అధికారులు ఇటీవల యాప్‌లో 2,334 యూరియా బ్యాగులను స్టాక్‌గా చూపించగా, అందులో 2,157 బ్యాగులను రైతులకు పంపిణీ చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అయితే మిగిలిన బ్యాగుల కోసం రైతులు యాప్ ఓపెన్ చేసి చూడగా నో స్టాక్ అని చూపిస్తుండటంతో అనుమానం వచ్చింది. లెక్క ప్రకారం ఉండాల్సిన 177 బ్యాగులు తక్కువగా రావడం, గోదాంలో స్టాక్ లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా దొరకని రైతులు సొసైటీ అధికారులను నిలదీయగా వారు పొంతనలేని సమాధానాలు ఇచ్చారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా మాచారెడ్డి సొసైటీ పరిధిలో వందలాది యూరియా బ్యాగులు ఇదే తరహాలో మాయమయ్యాయని, ఇప్పుడు ఫరీద్ పేటలో కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతోనే ఆన్‌లైన్‌లో చూపించిన యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కలెక్టర్ చొరవ తీసుకొని విచారణ జరిపి అర్హులైన రైతులకు యూరియా సకాలంలో అందేలా చూడాలని, బ్యాగులు మాయం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

## అట్టహాసంగా రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం




**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో అట్టహాసంగా రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. శని, ఆదివారాల్లో జరుగనున్న టోర్నీని సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్ శనివారం ఉదయం ప్రారంభించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె.శోభన్ బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అభిషేక్ గౌడ్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పరిశీలకులు, జిల్లా డీవైఎస్‌వో పవన్ కుమార్, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ పరిశీలకులు యాసిన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి.మల్లేష్ గౌడ్, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ వేముల నాగభూషణం, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు ఎం.సుజాత, చిప్ప నవీన్, సీనియర్ క్రీడాకారులు రాహుల్, సాగర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** రైతుల విజ్ఞప్తి మేరకు ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నుంచి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సాగునీటిని విడుదల చేశారు. కుడి కాలువ నుంచి 90 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి 30 క్యూసెక్కుల చొప్పున మొత్తం 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 6,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధికంగా వరి సాగు చేస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. సాగునీటి విడుదలపై ఆంక్షలు ఉన్నప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో ప్రత్యేకంగా చర్చించి రామడుగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు అనుమతులు పొందినట్లు భూపతి రెడ్డి తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

## కలెక్టరేట్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వినాయక చవితి వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు గణనాథుడిని దర్శించుకుని అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు. ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి అన్న ప్రసాద వితరణ చేశారు. డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ సహకారం అందించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, ఆర్డీవో రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏవో బాలరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రశాంత్, భాస్కర్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఆర్కిడ్స్ పాఠశాల గణేష్ నిమజ్జనం



**అక్షరటుడే, బాన్సువాడ:** సాంప్రదాయ పద్ధతులను కాపాడుతూ భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించాలని బిచ్కుంద మండల కేంద్రంలోని ఆర్కిడ్స్ పాఠశాల ఫౌండర్ గోపి తెలిపారు. పాఠశాలలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భక్తి శ్రద్ధలతో భజనలు చేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన సాంప్రదాయాలను, సంస్కృతిని మరచిపోకూడదని, డీజేలు వద్దు భక్తితో గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బిచ్కుంద ఏఎస్సై దేవరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయకుడి సన్నిధిలో అన్నదానం



**అక్షరటుడే, కామారెడ్డి:** వినాయక నవరాత్రులను పురస్కరించుకుని కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. వినాయక చవితి నవరాత్రులను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం గణేశుడి నిమ్జనం పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం నుండి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని వేలం పాటలో డీఈ హన్మంతరావు రూ.42,500 లకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న హన్మంతరావుకు ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు, అధికారులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మధుసూదన్, సీఐ నరహరి, తహశీల్దార్ హిమబిందు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాన్ని సందర్శించిన డీఎల్పీవో



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని డీఎల్పీవో శివకృష్ణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గణేష్ మండపం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించారు. అన్నదానంలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను వినియోగిస్తున్న వడ్డెర సంఘం సభ్యులను అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు ఇటువంటి చర్యలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామరాజు గౌడ్, ఎంపీవో గంగామోహన్, వార్డు సభ్యులు, వడ్డెర సంఘం అధ్యక్షుడు సతీష్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# బ్రేక్ ఫాస్ట్‌కు పడ్డట్టేనా..?

**రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈ ఏడాది జూలైలో ప్రారంభించారు. హైదరాబాద్‌లోని నాచారంలో ఆసియాలోనే అతిపెద్దదైన 'నూతన బాలామృతం ప్రొడక్షన్ ప్లాంట్'కు సైతం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. కానీ పథకం అమలుపై జిల్లాలో నీలినీడలు కమ్ముకున్నాయి.**

**– అక్షరటుడే గాంధారి**

■ పాఠశాలల్లో విద్యార్థులకు అందని అల్పాహారం ■ జిల్లా కేంద్రంలో 975 స్కూళ్లలో నో బ్రేక్‌ఫాస్ట్ ■ ఎదురుచూస్తున్న విద్యార్థులు

స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి విద్యార్థికి అల్పాహారం అందించేందుకు తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని చెప్పి నేటికి రెండు నెలలు గడుస్తున్నా పథకం ప్రారంభానికి నోచుకోలేదు. అల్పాహారంలో భాగంగా విద్యార్థులకు రాగిజావ, పూరి, ఇడ్లీ, చపాతి, దోశ ఇలా అన్ని అందిస్తామని చెప్పిన ఇంకా ఆచరణలోకి రావడం లేదు. స్కూళ్లలో నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్ అందించడానికి స్థానిక రైతుల నుంచి నేరుగా ఆర్గానిక్ కూరగాయలు, వస్తువులను సేకరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అప్పట్లో ప్రకటించారు.

### జిల్లాలో 975 పాఠశాలలకు..

కామారెడ్డి జిల్లాలో మొత్తం 975 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో దాదాపు 82,372 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఇప్పటివరకు కేవలం మధ్యాహ్న భోజనంతో సరిపెడుతున్నారు. ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్ పెడితే ఆకలితో ఇబ్బందులు పడే విద్యార్థులు బాగా చదువుకుంటారనే ఉద్దేశంతో సీఎం పథకం ప్రారంభించినప్పటికీ అమలుకు నోచుకోవట్లేదు. బ్రేక్ ఫాస్ట్ అందించి మధ్యాహ్నం భోజన పథకం మిడ్‌డే మీల్స్ అందిస్తూ వారి ఆరోగ్యంతో పాటు మంచి భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మన్ననలు పొందినప్పటికీ అమలైతే బాగుండని ఉపాధ్యాయులు సైతం పేర్కొంటున్నారు.

### ఆశ కల్పించి..

విద్యార్థులకు అల్పాహారంపై ఆశలు లేకున్నప్పటికీ వారికి ఆశలు కల్పించి ఇప్పుడు అల్పాహారం పెట్టకపోవడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు గాని విద్యార్థుల తల్లిదండ్రులు గాని ఏ ఒక్కరు కూడా బ్రేక్ ఫాస్ట్ విషయం అడగలేరని స్వయానా సీఎం ప్రకటించి అనంతరం దాని ఊసే తీయకపోవడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నిస్తున్నారు.

### దసరా తర్వాతే..

దసరా చివరి వారంలో పథకం ప్రారంభం కానుంది. అయితే ప్రతి పాఠశాలకు కావాల్సిన ముడి సరుకులు సర్దుబాటు చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అది పూర్తికాగానే తప్పనిసరిగా ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటాం.

**– మల్లికార్జున్, ఎంఈవో, గాంధారి**

## వికలాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని బాలగౌడ్ ఫంక్షన్ హాల్‌లో అలింకో, సమగ్ర శిక్ష కామారెడ్డి ఆధ్వర్యంలో వికలాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిలో 20 మందిని, నాగిరెడ్డిపేట్‌లో పదహారుగురిని, లింగంపేట్‌లో 20మందిని, నిజాంసాగర్ నుంచి 8మందిని, మహమ్మద్ నగర్‌లో 12మందిని గుర్తించి వారికి పేర్లు నమోదు చేసుకున్నారు. 76 అర్హులైన దివ్యాంగ విద్యార్థులకు డిసెంబర్ నెలలో ఉపకరణాలు పంపిణీ చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజులు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త నాగవేందర్, అలింకో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ శరత్, ఆడియోలాజిస్ట్ స్వాతి, ఐఈఆర్‌పీలు వెంకటేశం, సాయిలు, సుజాత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, కంపాస్ బాక్స్‌ల అందజేత



**అక్షరటుడే, బోధన్:** నగరంలోని శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవీపేట మండలం అభంగపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం పెన్నులు, రైటింగ్ ప్యాడ్స్, కంపాస్ బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్, ఫౌండేషన్ ప్రతినిధులు బాలకృష్ణ, దయాకర్, చిదంబర్, ప్రసాద్, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, రవీందర్ రెడ్డి సంజీవ్, అనిల్ గోపిక, వాసంతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు, క్రీడాసామగ్రి పంపిణీ




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని అడవి లింగాల్ జడ్పీ హెచ్ఎస్‌లో దాత పెరిక హరికృష్ణ, చండిప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు తనవంతు సహకారం అంద జేస్తున్నట్లు వారు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో కొందరికి సైకిళ్లను అందజేయడంతో పాటు వాలీబాల్, ఇతర క్రీడలకు సంబంధించిన దుస్తులు, సామగ్రిని అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయకుల మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని వివిధ వినాయక మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాన్ని మండపం సమీపంలోనే సాంప్రదాయ పద్ధతిలో నిమజ్జనం చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతిని నిమజ్జనం చేయడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు.











## వేల్పూర్ బాధితులకు 'సీఎంఆర్ఎఫ్' ఊరట

**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ గ్రామానికి చెందిన పలువురు నిరుపేద బాధితులకు సీఎం సహాయ నిధి రూపంలో ఆర్థిక ఊరట లభించింది. శనివారం గ్రామానికి చెందిన ప్రత్యూషకు రూ. 60,000, సంతోష్‌కు రూ.13,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. తమకు ఆర్థిక సహాయం మంజూరు అయ్యేలా కృషి చేసిన మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బాధితులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వేల్పూర్ గ్రామ అధ్యక్షుడు రాజేందర్, రమణ, పన్నాల మల్లేష్, వేల్పూర్ రేవంత్ రెడ్డి, నరేందర్, రాజేందర్, మల్లయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** మానాల గ్రామంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మాలత్ అర్వింద్‌కు 53,000, గుగులోతు గంగాధర్‌కు రూ.25000 భూక్య సతీష్‌కు రూ.18,500, పుప్పాల గంగాధర్‌కు రూ. 60,000, మాలోత్ శంకర్‌కు రూ.60,000 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఈడీ లక్ష్మణ్, ఉప సర్పంచ్ దాసర అశోక్, తూమ్ జలపతి, జక్కు మోహన్, కొండ రాజేందర్, జక్కు వంశీ, జూల దిలీప్, కొమ్ముల రవీందర్, శ్రీనివాస్, లింగారెడ్డి, జక్కుల లక్ష్మి, నర్సయ్య పాల్గొన్నారు.



## విద్యార్థినులకు వైద్య శిబిరం

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మద్దుల రాకేష్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, జ్వరం, జలుబు, చర్మ వ్యాధులు, గాయాలు తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మురళి, కేజీబీవీ ప్రిన్సిపాల్ వినోద, నర్సింగ్ ఆఫీసర్ మమత పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన మానాల

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని హాసాకొత్తూర్, అమీర్ నగర్ గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను డీసీసీ మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పరామర్శించారు. అమీర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కచ్చా కాయల రమేష్ మనమరాలు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే చౌట్‌పల్లి సొసైటీ డైరెక్టర్ దేవయ రాజేశ్వర్ తల్లి ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ భాస్కర్, మండల మాజీ అధ్యక్షుడు సంకేట రవి, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి,హాసాకొత్తూరు సర్పంచ్ రేవతి గంగాధర్, ఉప సర్పంచ్ మనోహర్, లింగారెడ్డి, తిరుపతి, డీసీసీ సెక్రెటరీ సంజీవ్, అమీర్ నగర్ సర్పంచ్ దశరథ్, ఇనాయత్ నగర్ సర్పంచ్ రాములు నాయక్, ఉపసర్పంచ్ అనిల్, క్యాతం గంగారెడ్డి, పుప్పాల నర్సయ్య, కందరి భూమారెడ్డి, ధర్పల్లి రాకేష్, శేఖర్, రాజు పాల్గొన్నారు.